తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, మార్చి 4 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత రాష్ట్రప్రజల ఆరోగ్య భద్రతను కాపాడేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించిందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం శాసనసభలో ఆమె ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై జరిగిన చర్చలో పాల్గొని ప్రసంగించారు. హెల్తీ ఫ్యామిలీ ఈస్ ది వెల్తీ ఫ్యామిలీ అనే నినాదంతో సీఎం చంద్రబాబునాయుడు ముందుకు వెళుతున్నారన్నారు. యోగాంధ్ర అనే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి వారంరోజులు నిర్వహించి విజయవంతం చేశారని ఆమె గుర్తు చేశారు. యోగా వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఆమె చెప్పారు. కాగా, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ విషయమై యోగా కార్యక్రమం వేస్ట్ అని చెప్పడం దారుణమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య సమాజం బలమైన పునాది వేసేందుకు 13,306 కోట్లు మంజూరు చేయడం హర్షణీయమని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తంమీద 5.8 శాతం వైద్య రంగానికే కేటాయించడం జరిగిందని తెలిపారు. విద్య, గ్రామీణాభివృద్ధి తర్వాత మూడవ స్థానాన్ని వైద్య రంగానికి కేటాయించి నిధులు మంజూరు చేయడం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు నిదర్శన మన్నారు. వైద్య రంగానికి సంబంధించి 6,486 కోట్లు బకాయిలు ఉన్నాయ న్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద 2,500 కోట్లు బకాయిలు ఉండగా, ఇప్పటివరకు 1800 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ కింద ప్రభుత్వం 20 నెలల పాలన కాలంలో 124 కోట్లను 7,522 మందికి అందజేసిందని విజయశ్రీ తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోనే సీఎంఆర్ఎఫ్ కింద సుమారు 4 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రుల అభివృద్ధికి, మౌలిక సదుపాయాలకు 3,066 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రి భవనాలను, డయాగ్నస్టిక్, డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 108 వాహనాలకు సిబ్బంది కొరత ఉందని, తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని నెలవల విజయశ్రీ కోరారు. పునర్విక ఆర్థిక సహాయం అందించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు నారా లోకేష్ రూ.6 కోట్లు అందజేయడం అభినందనీయమని విజయశ్రీ తెలిపారు.

# లారీని... ఢీకొన్న కారు

**-ఐదుగురు బెంగుళూరు యాత్రికులు మృతి**
**-అసువులు తీసిన.. అతివేగం!**
**-తిరుమలేశుని దర్శనం కాకనే..తిరిగి రాని లోకాలకు**



ప్రమాద ఘటనలో మృతదేహాలను పరిశీలిస్తున్న సిఐలు



గంగవరం,మార్చి 4 ప్రభాతవార్త : చిత్తూరు జిల్లా, పలమనేరు మండలం గంగవరం వద్ద బుధవారం లారీని వెనుక వైపు నుంచి కారు ఢీ కొనడంతో ఐదుమంది అక్కడిక్కడే మృతి చెందడం జరిగింది. వేకువ జామున బయలుదేరడం వల్ల కారు నడుపుతున్న వ్యక్తి కునుకుపాటు వల్ల జరిగిన ఏమరపాటు వల్ల ప్రమాదానికి గురైనట్లు తెలుస్తుంది. ఓ కుటుంబం విగతజీవులైన సంఘటన బుధవారం గంగవరం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని బెంగళూరు,చెన్నై జాతీయ రహదారిపై దండపల్లె కూడలి సమీపంలో రహదారి రక్తసిక్తంగా మారింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా..కర్ణాటక రాష్ట్రం బెంగళూరు రాజాజీ నగరంకు చెందిన నాగరాజ రావు (61),ఇతని భార్య జయంతి (59),కుమార్తె పూజ(33)లతో పాటు జయ ంతి అక్క కుసుమ(61),బావ మోహనదాస్(71)లు తిరుమల శ్రీవారి దర్శనం కోసం తమ సొంత కారులో బయలుదేరారు. మండలంలోని దండపల్లె కూడలి సమీపంలోనికి రాగానే బైరెడ్డిపల్లె నుండి మాచర్లకు వెళ్తున్న లారీని కారు అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చి వెనక వైపు నుండి లారీ కిందకు దూసుకుపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదు మంది అక్కడికక్కడే దుర్మరణం చెందారు. లారీ కిందకు దూసుకుపోయిన కారులో ఇరుక్కున వారంతా ఆర్తనాదాలు పెడుతుండడంతో, సమీపంలోని ప్రజలు అతి కష్టం మీద వారిని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న గంగవరం అర్బన్, రూరల్, పలమనేరు సిఐలు రాంభూపాల్, పరశురాముడు, మోహన్‌రెడ్డి, పలమనేరు ఎస్ఐ లోకేష్‌రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంలో లారీ కింద ఇరుక్కుపోయిన కారును జెసిబి సహాయంతో తొలగించి, కారులో నుజ్జునుజ్జయి, ఛిద్రమైన మృతదేహాలను స్థానికుల సహాయంతో వెలికితీశారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం 108 వాహనాల్లో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతురాలు పూజ బెంగళూరు శివమొగ్గ నందు నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తుంది.ఈమె భర్త నిఖిల్ జర్మనీలో ఐటి సెక్టర్‌లో పని చేస్తున్నారు.విషయం తెలుసుకున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ప్రమాదానికి గల కారణాలపై చరవాణి ద్వారా అధికారులను ఆరా తీశారు.ప్రమాదాల నివారణ కోసం తగిన



మృతి చెందిన భార్య,భర్తలు జయంతి,నాగరాజరావు



మృతి చెందిన భార్య,భర్తలు కుసుమ,మోహన్‌దాస్

# నాటు తుపాకితో కాల్పులు

**- ఆర్థిక లావాదేవిల గొడవుల్లో స్నేహితుడిని కాల్చి చంపిన వైనం**

చిత్తూరు, మార్చి 4 ప్రభాతవార్త: చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాళ్యం గ్రామంలో బుధవారం నాటు తుపాకి కాల్పుల కలకరం రేగింది. అప్పటి వరకు ప్రాణ స్నేహితులుగా వున్న ఇద్దరు యువకుల మధ్య ఆర్థిక లావాదేవిలపై వివాదం చెలరేగడంతో ఒక స్నేహితుడు మరో స్నేహితుడిపై నాటి తుపాకితో కాల్పులు జరుపడంతో ఆ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనలో తుమ్మింద పాళ్యం గ్రామంకు చెందిన సాయికుమార్(24)ను అదే గ్రామంకు చెందిన ఢిల్లీబాబు (23) తన వద్ద వున్న నాటు తుపాకితో కాల్చి చంపాడు. సాయికుమార్, ఢిల్లీబాబులు గ్రామంలో స్నేహితులుగా మెలిగేవారు. వారు నిరంతరం పేకాట ఆడుకోవడం, రాత్రి సమయాల్లో నాటు తుపాకి తీసుకుని అడవిలోకి వేటకు వెళ్ళి జంతువులను వేటాడి తీసుకురావడం చేస్తుండేవారు. ఈ క్రమంలో స్నేహితులు ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవిల విషయంగా గత కొన్ని రోజులుగా వివాదం నెలకొంది. ఈ పరిస్థితుల్లో మంగళవారం సాయికుమార్, ఢిల్లీబాబులు ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన ఢిల్లీబాబు తన వద్ద వున్న నాటు తుపాకితో సాయి కుమార్‌పై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో సాయికుమార్ అక్కడికక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. సాయికుమార్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే సాయికుమార్ మృతి చెందినట్లు నిర్ధారణ అయ్యింది. అడవుల్లో వేట సాగించడానికి చిత్తపార, వెప్పాలమాను చేను ప్రాంతాల నుండి నాటు తుపాకులు సరఫరా అవుతున్నట్లు స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు.ఈ క్రమంలో రంగంలోకి దిగిన తాలుకా పోలీసులు సాయికుమార్ మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కల్తీనెయ్యి కేసులో...ఏకసభ్య కమిటీ దర్యాప్తు మొదలు

తిరుపతి,మార్చి 4ప్రభాతవార్త: తిరుపతి ఎస్వీ విశ్రాంతి గృహం కేంద్రంగా శ్రీవారి లడ్డూలకు కల్తీనెయ్యి వాడారనే కేసులో ఏకసభ్యకమిటీ విచారణ మొదలుపెట్టింది. టెండర్ నిబంధనలు మార్చడం, నెయ్యిసరఫరా టెండర్లు ఉల్లంఘించి కల్తీనెయ్యి సరఫరా చేయడంపై ఏకసభ్యకమిటీ విశ్రాంత ఐఎఎస్ దినేశ్‌కుమార్ నేతృత్వంలోని బృందం సమగ్ర దర్యాప్తు మొదలుపెట్టింది. ఈ ఉదంతంలో కీలకంగా వ్యవహరించిన సూత్రధారుల ప్రమేయం,వారి పాత్ర ఏమేరకు ఉందనే జోలికి వెళ్ళలేదు. ప్రభుత్వానికి అందజేసిన నివేదికల్లో కూడా రసాయనాలతో నెయ్యికల్తీజరిగిందనేది ఆధారాలతోరుజువు చేసింది. అయితే సూత్రధారులు,ఈ పాపంలో కీలక వ్యక్తులెవరనేది గుర్తించలేదు. కొందరు ఉద్యోగులను ఈ కమిటీ విచారణకు పిలవనుంది.

# ముళ్ళ పొదల్లో పసికందు!



నాయుడుపేట, మార్చి 4 ప్రభాతవార్త: నాయుడుపేటలోని చంద్రబాబు నగర్ కాలనీలోని ఇళ్ల సమీపంలో ముళ్ల పొదల్లో ఓ పసికందును పడవేసి ఉండటాన్ని అక్కడి స్థానికులు గుర్తించారు. కాలనీలో నివాసం ఉంటున్న ఎళ్ల సుజాత నివాస సమీపంలోని ముళ్ల పొదల్లో తెల్లవారుజామున పసిపాప ఏడుస్తున్నట్లు శబ్దం రావడంతో ఆమె భయాందోళన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని సుజాత కుమారులతో పాటు కాలనీలో ఉన్న కొంతమందికి తెలియజేయడంతో వారందరు ముళ్ల పొదల వద్దకు వెళ్లి పరిశీలించగా పసిపాప పడి ఉండటాన్ని గుర్తించారు. అయితే ఆ పాపకు కనీసం బొడ్డు పేగు కూడా కోయకుండ పడవేసి ఉండడంతో ఎవరో పుట్టింది ఆడపిల్లని తెలిసి మానవత్వం మరిచి కర్కశంగా ముళ్ల పొదల్లో పడవేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఆశ వర్కర్ ప్రవీణతో పాటు పసిపాప బొడ్డుపేగు కోసి స్థానిక భరత్‌నగర్ ఏఎన్‌ఎం ప్రశాంతితో కలిసి పాపపై ఉన్న రక్తపు మరకరలను శుభ్రం చేశారు. ఈ విషయమై సమాచారం అందుకున్న సీడీపీఓ ఉమామహేశ్వరీ ఆమె వెంటనే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. ప్రభుత్వ వైద్యులు పసిపాపకు వైద్య చికిత్సలు నిర్వహించి పాప క్షేమంగా ఉన్నట్లు వెల్లడించారు. 2.7 కేజీలపైగా ఉందని ఆరోగ్యవంతంగా ఉందని తెలిపారు. ఈ విషయమై సీడీపీఓ అంగన్‌వాడీ కార్యకర్తతో కలిసి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# మెరుగైన ఉపాధి కల్పించాలి

**-పరిశ్రమలశాఖతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**



జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఈ.పి.సి) సమీక్ష

తిరుపతి,మార్చి 4ప్రభాతవార్త: నూతన ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల స్థాపనకు, పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలని, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు సక్రమంగా అమలు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఈ.పి.సి) సమీక్ష జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానంలో 2,440 పరిశ్రమలకుగాను 2,323 అనుమతులు ఇచ్చామని తెలిపారు. మరో 116 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలు పరిశీలన కమిటీకి అందిన మేరకు 16 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు 4.52 కోట్లు అందించడానికి ఆమోదం తెలిపారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ప్రింటింగ్ క్లస్టర్, తిరుపతి, కలంకారీ క్లస్టర్, శ్రీకాళహస్తి, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్, ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షి ంచి వేగవంతం చేయాలని అన్నారు. పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు వివిధ శాఖల అధికారుల వద్ద ఉన్న పెండింగ్ అంశాలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఏపిఐఐసి ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమలు వివిధ దశలలో వున్నాయని,ఇంకా ప్రారంభించని వాటిని త్వరిత గతిన ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ అమరయ్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, జోనల్ మేనేజర్లు ఏపిఐఐసి తిరుపతి, నెల్లూరు విజయ భరత్‌రెడ్డి, శివకుమార్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, శ్రీ సిటీ ప్రతినిధి భగవాన్, కార్మిక శాఖ అధికారి చిన్న లాలప్ప, డిఆర్‌డిఏ పిడి శోభన్ బాబు, లీడ్ బ్యాంకు మేనేజర్ రవి కుమార్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్,ఎపిడిడిఆర్‌డిఏ ప్రభావతి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం ద్వారా... భూమి సారం- రైతు ఆదాయం పెరుగుదల

తిరుపతి,మార్చి 4ప్రభాతవార్త: ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారం-రైతు ఆదాయం రెండింటి పెరుగుదల సాధ్యమవుతుందని,సహజ పద్ధతుల విస్తరణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో సహజ వ్యవసాయ ఉత్పత్తులకు రాష్ట్ర స్థాయిలో బలమైన మార్కెట్ వేదికను ఏర్పాటు చేయాలనే లక్ష ్యంతో కొనుగోలు-అమ్మకందారుల నెట్‌వర్కింగ్ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల భూమి సారం తగ్గిపోవడం, ప్రజల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం అవసరం మరింతగా పెరిగిందని అధికారులు పేర్కొన్నారు. సహజ వ్యవసాయం అనుసరించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు దిగుబడులు స్థిరంగా ఉంటాయని వివరించారు. రసాయన అవశేషాలు లేని ఆహారం ప్రజలకు అందించడం ద్వారా ఆరోగ్య రక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.రైతులు పూర్తిగా సహజ వ్యవసాయం వైపు మారేందుకు శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమములో సిఈఓ బి. రామారావు ,జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. ప్రసాదరావు, డిపియం.షణ్ముగం వివిధ జిల్లాల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వే అంశాలపై మరింత దృష్టి

**రెవెన్యూ శాఖ అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, మార్చి 4 ప్రభాతవార్త: రెవెన్యూ, రీ-సర్వే, భూ సంబంధిత అంశాలు ప్రజలతో ముడిపడి వుండటంతో వీటిని సకాలంలో నాణ్యతతో పరిష్కరించడానికి అధికారులు మరింత దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్, రీ-సర్వే సంబంధిత రెవెన్యూ అంశాలపై అర్డీఓలు, తహసిల్దార్లు, సర్వేయర్లతో రెవెన్యూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ రెవెన్యూ అంశాల్లో ప్రభుత్వ ఆదేశాలు అమలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలపై అధిరానేలకు స్పష్టమైన దిశా నిర్దేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో వున్న మ్యుటేషన్లను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో భూరికార్డుల నమోదు ప్రక్రియ గడువులోపు ముగించాలని స్పష్టం చేశారు. సర్వీస్ లెవల్ అగ్రిమెంట్(ఎస్ఎల్ఎ) గడువులు దాటకుండా ప్రతి దరఖాస్తును సమయపాలనతో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వ సేవలపై ప్రజల సానుకూల భావన 80 శాతంకు పైగా పెంచడానికి చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఈ మేరకు భూ సమస్యలను క్షేత్ర స్థాయిలో పక్కాగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అలాగే భూహక్కు పత్రం, మ్యూటేషన్, 22ఎ నిషేధిత భూములు, సర్వే నెంబర్ సబ్ డివిజన్ తదితర భూ సంబంధిత పెండింగ్ అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో ఆర్ఓఆర్ కేసులను త్వరితంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని, పలమనేరు డివిజన్‌లో 29, చిత్తూరు డివిజన్‌లో 174, నగరి డివిజన్‌లో 53, కుప్పం డివిజన్‌లో 20 ఆర్ఓఆర్ కేసులు వున్నాయన్నారు. కోర్టు కేసులకు సంబంధించి ఫైల్స్‌లోని ప్రతి అంశంను క్షుణ్ణంగా పరిశీలించి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించాలని, విలేజ్ సర్వేర్ లాగిన్ ముఖ్యమన్నారు. కోర్టు ఫైళ్ళకు సంబంధించి సంబంధిత హెచ్‌డిలు క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, కుప్ప అర్డీఓ విజయలక్ష్మీ, నగరి అర్డీఓ అనుపమ, సర్వే డిడి జయరాజ్, వివిధ మండలాల తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.




రెవెన్యూ రీ-సర్వే అంశాలపై అర్డీఓలు, తహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

# అమలుకాని మాస్టర్ ప్లాన్

**-ఒక్క భవనం సేకరణలో నత్తనడక- కొత్త ఇఓకు పలు సవాళ్ళు**



నూతన ఇఓ వెంకటేశులు

శ్రీకాళహస్తి,మార్చి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయ కార్యనిర్వహణాధికారిగా మరో రెవెన్యూ అధికారి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కడపజిల్లా ముద్దనూరు గాలేరు-నగరి సుజల స్రవంతిలో పని చేస్తున్న బికె వెంకటేశులును శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఈ ఉత్తర్వులు జారి అయి 10రోజులైంది. అయితే ఇక్కడ డెప్యూటేషన్ పై పని చేస్తున్న టి.బాపిరెడ్డి తనకు ఇక సర్వీసు మూడు నెలలే ఉందని అభ్యర్థిస్తూ కోర్టును ఆశ్రయించారు. అయితే అక్కడ కోర్టు ఇఓ వాదనను తోసిపుచ్చింది. దాంతో బదిలితప్పని సరి అయ్యింది. ఈ నేపధ్యంలో ఇక్కడకు నియమించిన కొత్త ఇఓగా వెంకటేశులు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన బుధవారం రాత్రి ఇక్కడకు చేరుకొని బస చేసి ఉదయం స్వామి అమ్మవార్లను దర్శించుకొని బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

**కొత్త ఇఓకు సవాలుగా మాస్టర్ ప్లాన్..దళారుల కట్టడి:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి రెవెన్యూశాఖ నుంచి డెప్యూటేషన్ మీద ఇఓలను నియమిస్తున్నారు. అయితే వారు ఆలయంలో 'రెవెన్యూ'ను దృష్టిలో పెట్టుకొని పరిపాలిస్తున్నారు తప్ప ఆలయానికి సంబందించి ఆస్తిపాస్తుల పరిరక్షణ, ఇక్కడి ఆచార వ్యవహారాలు,బయటి ఆలయాలు,పాతికేళ్ళుగా కోర్టులో నలుగుతున్న పట్టణంలోని రూ.కోట్ల ఆస్తి వివాదాల గురించి పట్టించుకోవటం లేదు. కొత్త ఇఓకు 'మాస్టర్ ప్లాన్ సవాలు'గా చెప్పవచ్చు. ఈ అంశానికి సంబంధించి శాసనసభ్యుడు ఏమో ఒకే ఒక సమస్యగా ఉన్న భవనానికి సంబందించి చెల్లింపులు కూడా చేసినట్లు చెబుతున్నారు. ఈ పథకం అమలుకు సంబంధించి సన్నిధివీధిలో ఒకే భవనం అడ్డంకిగా ఉంది.ఈ భవనం సమస్యను పరిష్కరించమని 2025 మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల సమీక్షను మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించినపుడు సాక్షాత్తు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డి ఆదేశించారు. ఇఓ బాపిరెడ్డి తన 15 నెలల కాలంలో ఎన్నో సంస్కరణలు తెచ్చారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపధ్యంలో రూ.27కోట్లతో చేపట్టిన శివం టు శివం రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డును శివరాత్రి ముందు దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డి ప్రారంభించారు.కానీ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ పనులకు సంబంధించి అన్నా క్యాంటిన్ వద్ద నాలుగు ఇళ్ళు సేకరించాల్సి ఉంది. అంతేకాక ఓ ప్రైవేటు భవనం కొంత భాగం తీసుకోవాల్సి ఉంది. ఇక సన్నిధి వీధిలో ఆలయానికి సంబంధించి చక్కటి రోడ్డును నిర్మించారు. ఆ ఏడాది శివరాత్రికి ముందే పరిష్కరించమని ప్రస్తుత జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌కు ఆదేశించారు. 15 నెలలు దాటినా ఇప్పటి వరకు ఈ సమస్య పరిష్కరింపబడలేదు. ఈ సమస్యను కొత్త ఇఓకు సవాలుగా చెప్పవచ్చు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు బస సదుపాయం ప్రశ్నార్థకంగా మారింది. దేవస్థానంకు సంబంధించిన సత్రాలు, గదుల సమస్యను భక్తులకు అందించుటకు కృష్ణారెడ్డి మండపంలో సెంట్రల్ రిసెప్షన్ ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ రోడ్డు ఆలయానికి వచ్చే భక్తులకు సదుపాయంగా కాకుండా 'ఆర్‌టిసి బస్సుల ప్రయాణానికి' ఉపయోగ పడుతుంది. ఈ మార్గంలో ఆర్‌టిసి బస్సులను నిషేధించటంతో అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనబడుతుంది. వచ్చిన ప్రతి అధికారి రాహుకేతుదోష నివారణపూజలు, ఎసి గదుల్లోకూర్చొని సిసి కెమెరాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవటానికే పరిమితమౌతున్నారు. అధికారులు తరచూ ఆలయంలో పర్యవేక్షించాల్సి అవసరం వుంది. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన నాయకుల సిఫార్సులతో ఇక్కడ చేరిన ఉచిత సేవకులు ఆలయాన్ని వ్యాపార కేంద్రంగా మార్చుకుంటున్నారు. దాంతో సామాన్య భక్తులకు సుదర్శనం అనేది మాటలకే పరిమితమౌతుంది.ఇలా ఎన్నో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మరి కొత్తగా వచ్చే ఆలయకార్యనిర్వహణాధికారి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాలి.

# కులగణనతో సామాజిక న్యాయానికి కొత్త దిశ

**-బి.సి.వర్గాల అభ్యున్నతి కోసం నాయకులు ఐక్యంగా కృషి చేయాలి**
**-బి.సి.సంక్షేమ సంఘ సమావేశంలో ఆర్.కృష్ణయ్య**

తిరుపతిరూరల్, మార్చి4 ప్రభాతవార్త: బి.సి.వర్గాల అభ్యున్నతికి నాయకులు ఐక్యంగా కృషి చేయాలని బి.సి.సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఓహోటల్‌లో బి.సి.సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృత సమావేశం జరిగింది. 77సంవత్సరాల చరిత్రలో ఏ ప్రభుత్వం కులగణన చేపట్టలేదని, ఆఘనత ప్రధాని మోదీ నాయకత్వంలోని భారతీయ జనతాపార్టీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 1931 తర్వాత తొలిసారిగా కులగణన చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని ఆయన అభివర్ణించారు. కులగణన అనంతరం బి.సి.లకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో న్యాయపరమైన వాటా లభిస్తుందని తెలిపారు. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో బి.సి.లకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కేంద్రంలో ప్రత్యేక బి.సి.మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి, రూ.2లక్షల కోట్లతో అభివృద్ధి పథకం ప్రకటించాలని డిమాండ్ చేశారు. బి.సిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 50శాతానికి పెంచాలని, పదోన్నతులలో రిజర్వేషన్ కల్పించాలని, క్రిమిలేయర్ నిబంధన తొలగించాలని తీర్మానించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయ మూర్తుల నియామకంలో ప్రవేట్ రంగంలో కూడా ఎస్సీ,ఎస్టీ, బి.సి.లకు రిజర్వేషన్స్ అమలు చేయాలన్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 16లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మడకశిర నియోజకవర్గ బి.సి. సంక్షేమ అధ్యక్షుడిగా కంచప్ప యాదవ్, పెనుకొండ నియోజకవర్గ అధ్యక్షుడుగా కె.ఎన్.అశ్వర్థ నారాయణలను నియమిస్తూ కృష్ణయ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జి నూకాలమ్మ, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడుగా శ్రీరాములు యాదవ్, రాష్ట్ర కార్యధర్శి బాలాంజనేయులు, తిరుపతి అధ్యక్షుడు అమర్నాధ్ తదితరులు పాల్గొన్నారు.




బుధవారం బి.సి.సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యచే బిసిల కులగణనపై విస్తృత సమావేశం

## నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

– టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం



**కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారంకు చొరవ చూపడంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానని టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు, కులంలో వివిధ హోదాల్లో ఉన్న సంఘ నాయకులు, పార్టీ కోసం కష్టపడిన యువత తొంభైమందికి తిరుమలలో శ్రీవారి విఐపి దర్శనం చేయించినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన సహచర బోర్డు సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## సిఎంకు దివ్యాంగుడి కృతజ్ఞతలు



**రామకుప్పం, మార్చి 4 ప్రభాతవార్త :** మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గడ్డూరుకు చెందిన హనుమంతు తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు కావడం పట్ల సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపాడు. తన సమస్యలను ఎంఆర్‌పిఎస్ నేతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు తనకు పెన్షన్ మంజూరయ్యేలా చర్యలు చేపట్టారన్నారు. బుధవారం హనుమంతుకు ఎంఆర్‌పిఎస్ నేతలు పెన్షన్ నగదు అందించారు. కార్యక్రమంలో నేతలు వెంకటేష్, గోవిందప్ప, జయప్ప, సర్పంచ్ రాజగోపాల్, ఆనందప్ప, హరి, భాస్కర్, గిరి, చంద్ర పాల్గొన్నారు.

## ఉన్సిగానిపల్లిలో కెఎస్ఎస్‌చే కార్యక్రమం



**రామకుప్పం, మార్చి 4 ప్రభాతవార్త:** మండలంలోని ఉన్సిగానిపల్లిలో కుటుంబ సాధికార సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలు, వారి సమస్యలు సేకరిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపిపి సులోచన గుర్రప్ప, పంచాయతీ అధ్యక్షుడు మనీష్, ఎస్ఎంసి ఛైర్మన్ షణ్ముగం, ఎంఆర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి



**పెద్దపంజాణి, మార్చి 4 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్సై మారెప్ప సూచించారు. బుధవారం ప్రజలకు రోడ్డు భద్రత, హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. వాహన దారులుహెల్మెట్‌ధరిస్తే ఏదేని ప్రమాదం జరిగినా ప్రాణాలు దక్కించుకునేందుకు తలకు దెబ్బ తగలకుండాహెల్మెట్ దోహదపడుతుం దన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారే అధికంగా ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు.

## అంగన్‌వాడీల నిరసన

వి.కోట, మార్చి 4 ప్రభాతవార్త:

తమ డిమా ండ్ల సాధనకోసం ధర్నా చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలను విజయవాడలో అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందప్ప నేతృత్వంలో వి.కోటలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను సానుకూలంగా పరిష్కరి ంచాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘాలు, పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

## టీడీపీ లీడర్ టు క్యాడర్ పోస్టర్లు ఆవిష్కరణ



యర్రావారిపాలెం, మార్చి 4 ప్రభాతవార్త: యర్రావారి పాలెం మండల కేంద్రంలో టీడీపీ పార్టీ నాయకులు లీడర్ టు క్యాడర్ పోస్టర్లు లను ఆవిష్కరించారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సాంకేతిక వేదికలను వినియోగిం చుకోవాల్సి న అవసరం ఉందన్నారు. మై టీడీపీ యాప్‌ను ప్రతి కార్యకర్త తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పోస్టర్‌లో పొందుపరిచిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే యాప్ సులభంగా ఇన్‌స్టాల్ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ్, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, పార్లమెంట్ కార్యదర్శి మధు, మహిళా అధ్యక్షురాలు లక్ష్మిదేవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభ నాగరాజ, వెంకట శివ రామిరెడ్డి, టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిన్నపరెడ్డి,టీడీపీనాయకులుబొమ్మలజగదీష్, విజయ్ కుమార్ నాయక్, హేమరత్నం, ప్రసాద్ నాయుడు, విజయ్‌కుమార్‌రెడ్డి, గోపి, శ్రీనాద్, బాలకృష్ణ నాయుడు, చంద్రబాబు నాయుడు, ఉదయ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

**పులిచెర్ల, మార్చి 4, ప్రభాతవార్త:** పులిచెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండని సిడిపిఓ వాణి శ్రీ దేవి తెలిపారు. అంగన్‌వాడి కార్యకర్తలకుగాను, కల్లూరు 3 మెయిన్ అంగన్వాడికి, పానరావాండ్లపల్లికి ఒసి కులానికి చెందిన వారు, హెల్పర్లుగా చిగురుమాకులపల్లి బిసిఎ, చెన్నుపాటివారిపల్లి, చెరుకువారిపల్లి ఒసిలు, దిగువబెస్తపల్లి బిసి ఏ, జెండామానువీధి బిసి ఈ, కమలాపురం ఎస్టి, ముల్లంగి హరిజనవాడ ఎస్‌సి, పగడాలవారిపల్లి, ఎస్‌టి, పాతపేట ఓసి, ఊడగమాకులపల్లి బిసి ఈ కులానికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, అభ్యర్తులు వివాహితులై, స్థానికులై ఉండాలన్నారు. తమ విద్యార్హత

# రైల్వే కోడూరు డివిజన్

## శివ సాయి నేతృత్వంలో ఇఫ్తార్ విందు



రైల్వే కోడూరు,మార్చి 4 ప్రభాతవార్త : రైల్వే కోడూర్ పట్టణంలోని జగడం పల్లి సమీపంలో ఉన్న మసీదు నందు బుధవారం పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రైల్వేకోడూరు వైసిపి నేత తోట శివసాయి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తోట శివ సాయి మాట్లాడుతూ రైల్వే కోడూరు పట్టణంలోని జగడంపల్లికి చెందిన ముస్లింలు పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని ప్రతి ఏటా ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి రైల్వే కోడూరు కు చెందిన జామియా మసీద్ పెద్దలు ముజీబ్, వైయస్ అన్వర్ భాష, కౌరెడ్డి సిద్దయ్య, కరిముల్లా, క్రిస్టియన్ మైనారిటీ నాయకుడు ప్రదీప్, నందా బాల, నాగేశ్వరరావు, ఉంగరాల రమేష్, రఊవు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ స్పైర్ అవార్డుకు విద్యార్థులు



పుల్లంపేట, మార్చి 4 ప్రభాతవార్త: మండల కేంద్రమైన పులంపేటలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్ కు చెందిన విద్యార్థులు ఎస్ శ్రీచరణ్, కె.తనూజ అను విద్యార్థులు శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి, సృజనాత్మకత సామాజిక సమస్యలపై చైతన్యంతో రూపొందించిన ప్రాజెక్టుపై ఎంపిక ఇవ్వడం పాఠశాలకు గర్వకారణం అన్నారు ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం అగ్ని ప్రమాదాలను గుర్తించి స్వయం చాలకంగా ఆర్పగలిగే సాంకేతికతతో రూపొందించబడిదన్నారు. ఈ ప్రయోగం భవిష్యత్తులో అగ్ని ప్రమాద విభాగానికి ఉపయోగపడే విధంగా చేయడం జరిగిందని పాఠశాల హెడ్మాస్టర్ గంజి నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ రహమాన్ సరళమ్మ మహబూబ్ బి బొడిచర్ల కృష్ణ నాగలక్ష్మి వాసు దేవరాజు మేరవ సురేష్ తదితరులు పాల్గొన్నారు

## జూలియన్ రాజుకు ప్రతిష్టాత్మక అవార్డు

రేణిగుంట,మార్చి 4 ప్రభాతవార్త:



ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ అధ్యక్షుడు జూలియన్ రాజు కు అమెజాన్, డొనేట్ కార్ట్ సంస్థలు ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ప్రత్యేక అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గత సంవత్సరం కురిసిన విపరీతమైన వర్షాల కారణంగా రేణిగుంట ఏర్పేడు మండలాలలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ రాజు దాదాపు 400 మంది పేదలకు విశిష్ట సేవలు చేశారు. ఆయన సేవలను గుర్తించిన ఇరు సంస్థలు అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు, మార్చి 4 ప్రభాతవార్త:

పలమనేరు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో సబ్ డివిజన్ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. 220 కెవి మహదేవ మంగళం నుండి పలమనేరు వరకు లైన్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పలమనేరు బైరెడ్డిపల్లె, వి.కోట, శాంతిపురం, కుప్పం మండలాల పరిసరాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండవచ్చు ఒక వేళ లేక పోవచ్చని ప్రజలు సహకరించాలని కోరారు.

## శ్రీ తిరుపతి గంగమ్మకు రూ35.96లక్షల ఆదాయం

– 110గ్రాముల బంగార ం , 721గ్రాముల వెండి



కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త: కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గ ంగమ్మ అమ్మ వారికి భక్తులు సమర్పించిన కానుకల రూపంలో రూ 35,96,260ల ఆదా యం లభించినట్లు ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు తెలిపారు. బుధవారం ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంగణం లో దేవదాయ శాఖ అధికారుల సమక్షం లో ఛైర్మన్ అధ్వర్యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. కాగా అమ్మవారికి 110గ్రాముల బంగారు, 721గ్రాముల వెండి వస్తువులను భక్తులు హుండీల్లో వేసి సమర్పించారు.గత తొమ్మిది నెలల కాలంకు సంబంధించి హుండీ లెక్కింపు చేపట్టినట్లు ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాల్లో లబ్ది

– పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు

కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త:



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాల్లో లబ్ది కలుగుతుందని పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పి.బి.నత్తంలో జరిగిన కుటుంబ సాధికార సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు ఉన్నా సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో లక్షలాది మందికి లబ్ది కలుగుతోందన్నారు. దీ ంతో పాటు కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున ్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. వైకాపా పాలనలో రోడ్లకు గు ంతలు పడితేకూడా తట్టమట్టి వేసే వారు కరువయ్యారన్నారు. నేడు గ్రామ గ్రామాన సిసి, బిటి రోడ్లు, డ్రైనేజ్‌లు, నీటి వసతి, ఎల్‌ఇడి విద్యుత్ లైట్లు ఏరా ్పటుచేశారన్నారు. పాడి రైతుల కోసం గోకులం షెడ్లను మంజూరు చేస్తున్నారన్నారు. కెఎస్ఎస్ సభ్యులు ప్రజల దగ్గరకు వెళ్లి వారి సాధక బాధలు తెలుసుకుని సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివ ం, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కనీసవేతనాల మండలి సభ్యుడు శరవణ, కడ సభ్యుడు రామచంద్ర, సర ్పంచ్ రవి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, రెస్కో డైరెక్టర్ మురళి, యూనిట్ ఇన్‌చార్జ్ పళని పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ స్థంభాల ఏర్పాటు



కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త: స్థానిక డికెపల్లిలో నూతన విద్యుత్ స్థంభాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు రెస్కో డైరెక్టర్ ఆర్ముగం తెలిపారు. స్థానికంగా ఉన్న పాత విద్యుత్ స్థంభాలతో ప్రజలకు ఇబ్బంది ఉండడంతో పాటు అమ్మవారి జాతర నిర్వహణకు సైతం సమస్య ఉండేదన్నారు. దీంతో పాలకవర్గం నిర్ణయంతో నూతన విద్యుత్ స్థంభాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కౌన్సిలర్ వేలు,నేతలునబీఉల్లా,సోమశేఖర్,సాయికుమార్, ఊరిగౌడు సత్తి, నాగభూషణం, అల్లాబకష్ పాల్గొన్నారు.

## కుప్పం,కమతమూరులో కొత్త హైమాస్ట్ లైట్లు

కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధిలోని కమతమూరు గ్రామంలో, కుప్పం పట్టణం ప్యాలస్ రోడ్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం పట్టణ సుందరీకరణలో భాగంగా సిఎం చంద్రబాబునాయుడు ఆదేశానుసారం హైమాస్ట్ లైట్లను కొత్తగా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, కమీషనర్ శ్రీనివాసరావు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, రెస్కో డైరెక్టర్ శివ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలతో అనర్థాలు అధికం

**బైరెడ్డిపల్లి, మార్చి 4 ప్రభాతవార్త:** బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు అధికమని హెచ్ఓ కా ంతమ్మ పేర్కొన్నారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పద్మావతి ఆదేశాలతో తీర్థ ం గ్రామంలో మహిళలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నవయసులోనే బాలికలకు వివాహాలు చేస్తే కలిగే నష్టాలు వివరించారు. వేసవి దృష్ట్యా ప్రజలు తగుజాగ్రత్తలు తీసుకుని వీలైనంతగా ఎండలో తిరగడం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, శాంతమ్మ, మహిళలు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ టెస్టులు

రేణిగుంట, మార్చి 4 ప్రభాతవార్త :



రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ వేమాపురం సంజీవరెడ్డి కాలనీ మండల పరిషత్ పాఠశాల నందు విద్యార్థులకు వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షుడు వి లక్ష్మీ ్మపతిరెడ్డి టెక్నీషియన్‌లతో బుధవారం బ్లడ్ గ్రూప్ టెస్టులు చేయించారు. వారి బ్లడ్ గ్రూప్ టెస్ట్ రిపోర్ట్ లను విద్యార్థులకు అందజేశారు. ప్రతి విద్యార్థి బ్లడ్ గ్రూప్ ముందుగా తెలుసుకోవడం వల్ల వైద్యపరంగా వారికి ఎంతో ఉపయోగం కలుగుతుందని లక్ష్మీ ్మపతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యుగంధర్, పంచాయతీకి చెందిన ఎం ఎన్ హెచ్ పిఒ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో బడిఈడు కార్యక్రమం

కేవీబీపురం, మార్చి 4 ప్రభాతవార్త:




మండలంలోని అంజూరు పరిధిలో పీవీ పురం ప్రాథమిక పాఠశాలలో బుధవారం అకాడమిక్ సంవత్సరానికి గాను బడిఈడు కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి రవికుమార్, అంజూరు సీఆర్పీ ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటకృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగింది. పీవీ పురం ప్రధానోపాధ్యాయుడు 2026-27 సంవత్సరానికి గాను 6మంది పిల్లలను అడ్మిషన్లు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే పిల్లలు చేర్పించాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమంగా తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ సమర్థవంతంగా ఉందని, అలాగే విద్యను బలోపేతం చేసే కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి ఎక్కువగా ఉందని, కావున ప్రతి ఒక్కతల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కె.జ్యోతి, అంగన్‌వాడీ టీచరు పోలమ్మ, సీఆర్పీ రవిలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గణనాధుని సన్నిధిలో తెలంగాణా మంత్రి

కాణిపాకం, మార్చి 4 ప్రభాతవార్త:



తెలంగాణా రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలోఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన ్స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి రెండు లక్షలు విరాళం





కాణిపాకం, మార్చి 4 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున ్న వివిధ పథకాలకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు కృష్ణాజిల్లా కుటుంబ కోడూరుకు చెందిన తుమ్మల దేవే ంద్ర అనే భక్తుడు సిద్ది వినాయక గో సంరక్షణ ట్రస్ట్‌కు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. అలాగే బెంగుళూరు చెందిన వేణుగోపాల్‌రెడ్డి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొతా ్తన్ని కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా ఆలయ టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## అర్ధగిరి ఆలయానికి నగదు లెక్కింపు యంత్రం విరాళం



తవణంపల్లె, మార్చి 4 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంకు అరగొండ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వారు నగదు లెక్కింపు యంత్రాన్ని బుధవారం విరాళంగా అందజేశారు. దేవస్థానంలో నగదు లెక్కింపు కోసం అరగొండ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వారు సుమారు 20 వేల రూపాయలు విలువగల నగదు లెక్కింపు యంత్రాన్ని విరాళంగా అందజేశారు. ఈమేరకు ఈయంత్రాన్ని బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార రెడ్డి తమ సిబ్బందితో కలసి దేవస్థానంకు ఛైర్మన్ ఎ.రఘుపతి, ఈఓ ఇ.మునిశేఖర్‌లకు అందజేశారు. ఈకార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## లైన్ డిపార్ట్‌మంట్ల సమన్వయంతోనే మహిళా సాధికారిత

– జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి వెంకటేశ్వరీ

చిత్తూరు, మార్చి 4 ప్రభాతవార్త:

మహిళా సాధికారిత కోసం ప్రభుత్వ లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి అన్నారు. కొంగారెడ్డిపల్లిలోని ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం మిషన్ శక్తి-సంకల్ప హబ్ 20 రోజుల కార్యక్రమం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై స్త్రీ శిశుసంక్షేమశాఖ పిడి వెంకటేశ్వరీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి వెంకటేశ్వరి మాట్లాడుతూ మహిళా సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను చేపట్టి అమలు చేస్తోందని ఈ పథకాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నాయని, ఈ రుణాలను ఆర్థికంగా బలోపేతం కావడానికి వినియగించాలన్నారు. జిల్లాలో మహిళలకు ఉపాధి అవకాశాలు మెండుగా వున్నాయని, టెన్త్ చదివిన వారి నుండి పరిశ్రమల్లో ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో వన్‌స్టాప్ అడ్మిన్, సిబ్బంది, సిడిపిఓ శ్యాం సుగుణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## గంగవరం రోడ్డు ప్రమాదంపై ఎంపీ దగ్గుమళ్ళ దిగ్భ్రాంతి

చిత్తూరు, మార్చి 4 ప్రభాతవార్త:

పలమనేరు నియోజకవర్గం గంగవరం మండల పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంపై ఎంపీ దగ్గుమళ్ళ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గంగవరం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకేసారి ఐదు మంది మృతి చెందడం తను తీవ్ర మనోవేదనకు గురిచేసిందని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఎంపీ అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

పాలసముద్రం, మార్చి 4 ప్రభాతవార్త:



మండలంలోని ఆముదాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్ష రాసే విద్యార్థులకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శివ విద్యా సామాగ్రిని అందించాడు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ విద్యతో పాటు క్రమ శిక్షణ కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని క్రమశిక్షణతో చదువుకొని జీవితానికి బంగారు బాట వేసుకొని ఉన్నత స్థాయికి ఎదగచ్చని అన్నాడు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువు కొనే విద్యార్థుల బాగుబోగులు చూడటానికి ముందు ఉంటానని ఈ సందర్భంగా తెలిపాడు. పదవ తరగతి పబ్లిక్ పరీక్ష రాసే విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని ఆశీర్వదించాడు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : సీఐ

పూతలపట్టు, మార్చి 4, ప్రభాతవార్త



మండలంలో ఉన్న పోలవరం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సురేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పూతలపట్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపి పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. నిరంతరం విద్య పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణతో ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని వ్యాఖ్యానించారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు పట్ల అవగాహన కల్పించారు. పాఠశాల మొదటి మూడు ర్యాంకర్లకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సిఐని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుమారస్వామి నాయుడు, భాస్కర్ రెడ్డి, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు నుంచి జారిపడి ఒకరికి తీవ్ర గాయాలు

పలమనేరు, మార్చి 4 ప్రభాతవార్త:



పలమనేరు పెద్దచెరువు కట్టపై బుధవారం సాయంత్రం ఓ ప్రైవేటు బస్సు నుండి జారి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరు నుండి చిత్తూరు వెళుతున్న ప్రవేటు బస్సు పలమనేరు శివార్లలోని పెద్దచెరువు కట్టపై వస్తుండగా డోర్‌వైపు ఫుట్‌పాత్‌పై నిలిచి వున్న గుర్తు తెలియని వ్యక్తి జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ ఇతన్ని బస్సు కండక్టర్ డ్రైవర్‌తో పాటు ఇతర వ్యక్తులు హుటాహుటిన పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## క్రమశిక్షణ పరిశోధన యూనిట్‌కు అవార్డ్స్

తిరుపతి హెల్త్, మార్చి 4 ప్రభాతవార్త:




డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఆధ్వ ర్యంలో ఎస్‌వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాల కులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు కు బహుళ పరిశోధన క్రమశిక్షణ యూని ట్ నోడల్ అధికారి డాక్టర్ ఏఎస్ కిరీటి, ఎస్‌వి వైద్య కళాశాల ప్రజా సంబంధాల అధికారి వీర కిరణ్‌కు బహుళ క్రమశిక్షణ పరిశోధన యూనిట్ కొరకు నిరంతరం కృషి చేసిన వారికి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, ఈ పరిశోధనల కోసం నిరంతరం కృషిచేసిన, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల యొక్క బహుళ క్రమశిక్షణా పరిశోధన యూనిట్ కు జాతీయ, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బహుమతుల అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సాయి సుధీర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, ఆరోగ్య విశ్వవిద్యాలయం మెంబెర్ డాక్టర్ మాధవి, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌జయశ్రీ,డిప్యూటీ రిజిస్టర్ రవికిరణ్, ఆరోగ్య విశ్వవిద్యాలయం సిబ్బంది తదుతరులు పాల్గొన్నారు.

## జూన్ 7న ఐసర్ ఆప్టిట్యూడ్ పరిక్ష

-నేటి నుంచి దరఖాస్తులు...ఎప్రిల్ 13 చివరి తేది

శ్రీకాళహస్తి,మార్చి 4 ప్రభాతవార్త:

తిరుపతి ఐసర్‌లో పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. మూడు రోజుల పాటు జరిగిన జాతీయసైన్స్ దినోత్సవం విజయంతం కావటానికి సహకరించిన ప్రతి ఒక్కరిని అభినందిస్తూ డైరెక్టర్ భట్టాచార్య పోటీ పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని విడుదల చేసారు. దరఖాస్తు చేసుకోవటానికి పోర్టల్ మార్చి 5న ఓపెన్ అవుతుందని తెలిపారు. దరఖాస్తుకు ఏప్రిల్ 13 చివరి తేది అని పేర్కొన్నారు. ఏదైనా తప్పులుగా దరఖాస్తు చేసి ఉంటే ఏప్రిల్ 16 నుంచి 18వరకు అవకాశం ఉంటుందన్నారు. పోటీ పరీక్షలకు హాల్‌టిక్కెట్లను మే 24న జారి చేయబడుతుందని తెలిపారు.'ఐసర్ అప్టిట్యూడ్(ఐఏటి) పరీక్షలు జూన్ 7న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంటే మూడు గంటలు ఉంటుందని వివరించారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రిటైర్డ్ తెలుగుగంగ అధికారికి సన్మానం

శ్రీకాళహస్తి,మార్చి 4 ప్రభాతవార్త:



రిటైర్డ్ తెలుగుగంగ సూపరింటెండెంట్ కాపు నాయకుడు పోలస్వామి షణ్ముగంను బుధవారం కాపు నాయకులు సత్కరించారు. ఆయన జన్మదిన సందర్భంగా ఆయనకు శ్రీకాళహస్తీశ్వరుని తీర్ధ ప్రసాదాలను అందించారు. ఈ సన్మాన కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు, పి.స్వర్ణమూర్తి, కొత్తపాటి శ్రీనివాస్‌రెడ్డి,రవి, కంఠా ఉదయ్‌కుమార్ ధన, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



తొట్టంబేడు,మార్చి 4 ప్రభాతవార్త:

తిరుపతిలో జరిగే ఏఐటియుసి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని బుధవారం సిపిఐ నాయకుడు మించల శివకుమార్ పిలుపు నిచ్చారు. వచ్చేనెల తిరుపతిలో భారీ ఎత్తున అఖిల భారత ట్రేడ్‌యూనియన్ సారథ్యంలో వచ్చేనెల జరగనున్న మహాసభలను జయప్రదం చేయాలని పార్టీకి పట్టు ఉన్నగ్రామాల్లో కరపత్రాలను పంపిణి చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పొరాటాలకు ప్రజలు సిద్దం కావాలని పిలుపు నిచ్చారు. అన్ని కార్మిక వర్గాలు పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమా ల్లో బత్తెమ్మ, శ్రీనివాసులు,లక్ష్మమ్మ, అంకమ్మ, కాంతమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ పోలీస్ స్టేషన్ నందు పోక్సో నమోదు!

రేణిగుంట మార్చి 4 ప్రభాతవార్త:

రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిందని రేణిగుంట అర్బన్ సిఐ జయచంద్ర వాట్సాప్ గ్రూప్‌లో ప్రెస్ నోట్‌ను బుధవారం విడుదల చేశారు. బాలికకు పరిచయమున్న వ్యక్తి ఆమెకు మాయ మాటలు చెప్పి బెదిరింపులకు గురిచేసి లైంగిక దాడి చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారని ప్రకటనలో పేర్కొన్నారు. బాధిత బాలిక ప్రస్తుతం తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితునిపై పోక్సో, సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడానికి చర్యలు చేపట్టినట్లు ప్రకటనలో తెలిపారు. కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా విచారించి బాధితురాలికి న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రకటనలో వివరించారు. నిందితుని వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు.

## తిరుపతిలో హోటళ్ళకు మళ్ళీ బాంబు బెదిరింపు!

తిరుపతి,మార్చి 4ప్రభాతవార్త:



తిరుపతినగరంలోని పలు హోటళ్ళకు మళ్లీ బుధవారం సాయంత్రం బాంబు బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపింది. తిరుపతిలో యాత్రికులు రద్దీగా ఉండే కపిలతీర్థం రోడ్డు లోని హోటళ్ళను టార్గెట్‌చేసుకుని పేల్చే స్తామని దుండగులు ఈ మెయిల్ ద్వారా బెదిరించారు. సమాచారం అందుకున్న పోలీ సులు, బాంబు డిస్పోజల్ టీమ్ పోలీసులు, జాగిలాలతో ఆయా హోటళ్ళలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

## విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు.

తిరుపతి,మార్చి 4ప్రభాతవార్త:



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, శక్తి టీమ్ సభ్యులు విద్యాల యాలు, పాఠశాలలను సందర్శించి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలలో సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు, టీనేజ్ వయస్సులో ఎదురయ్యే ఆకర్షణలు, వాటిని నియంత్రించకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలపై వివరణాత్మకంగా చర్చించారు. అమ్మాయిలు అన్ని రంగాలలో ముందంజలో నిలవాలని, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కొనే మనోబలాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలపై మోసాలు, మహిళలపై జరిగే నేరాలు, వివాహ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, తెలియని వీడియో కాల్స్ ద్వారా జరిగే మోసాలపై వివరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేయాలని తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని కోరారు.

## రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి విద్యమార్చి 4 ప్రభాతవార్త:

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ లో జరిగిన ఎం.కాం, ఎం.ఏ,ఎం.యస్సీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయ్యాయని, సంబంధిత వెబిసైట్ ద్వారా విద్యార్థులు పొందవచ్చని డీన్ ఆచార్య సురేంద్ర బాబు, కంట్రోలర్ డాక్టర్ రాజమాణిక్యం తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఎం.కాం., ఎం.ఏ. పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఉమెన్ స్టడీస్, ఎం.ఎస్సీ జాగ్రఫీ, ఆంత్రోపాలజీ, ఎన్విరాన్ మెంటల్ సైన్స్ సబ్జెక్టుల ఫలితాలు విడుదలయ్యాయి.

## మద్యం మత్తులో వీరంగం

కేవీబి పురం, మార్చి 4 ప్రభాతవార్త:

మద్యంమత్తులో ఉన్న ఓ యువకుడు 108 అంబులెన్స్‌లో వీరంగం సృష్టించి వాహన అద్దాలను పగులగొట్టిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. 108 సిబ్బందితెలిపిన వివరాల మేరకు... మండలంలోని మిద్దికండ్రిగ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగిందని సమాచారం అందడంతో 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన యువకుడిని అంబులెన్స్‌లో ఎక్కించి ప్రథమ చికిత్స అందిస్తూ కేవీబీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే వాహనం నుంచి కిందకి దించే సమయంలో మద్యం మత్తులో ఉన్న ఆ యువకుడు ఒక్క సారిగా అదుపు తప్పి వీరంగం సృష్టించారు. అంబులెన్స్‌కు సంబంధించిన అద్దాలను పగులగొట్టి సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేశాడు. ప్రాణాలను కాపాడే అత్యవసర సేవల వాహనంపై దాడి జరగడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఈనెల 17లోపు సర్వే పూర్తి చేయాలి

తిరుపతిరూరల్, మార్చి4 ప్రభాతవార్త:



ఈనెల 17లోపు ప్రతి ఇంటికి వెళ్లి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పూర్తి స్థాయిలో ఖచ్చితత్వంతో నమోదు చేయాలని జిల్లా స్వర్ణగ్రామ, స్వర్ణవార్డ్ పంచాయతీ అధికారి జి.వి.నారాయణరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. అవిలాల గ్రామంలో కొనసాగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, సిటిజన్, ఈ-కెవైసి, ఫీల్డ్ వెరిఫికేషన్ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి వివరాలు మిగలకుండా డేటా సేకరణ చేపట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు ఈ సర్వే అత్యంత ప్రాముఖ్యమైందని తెలిపారు. ఫీల్డ్‌స్థాయిలో ఎదురయ్యే సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రజలకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఈ-కెవైసి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, అవసరమైన పత్రాలు సిద్దంగా ఉంచుకునేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యధర్శి సుబ్బరాయుడు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ఉపాధి హామీ చట్టం సవరణ

చంద్రగిరి, మార్చి 4 ప్రభాతవార్త:



మహాత్మాగాంధీ జాతీయ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) 2005 చట్టంను భారత పార్లమెంట్ సవరణ గావించి పేరు మార్పు చేసినట్లు ఏపిఓ భార్గవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహనా కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికసిత్ భారత్ -2047 కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకాన్ని వికసిత్ భారత్ రోజ్‌గార్ అజీవిక మిషన్(విబి-జి రామ్ జి)2025గా పేరు మార్పు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పంచాయతీలలో 6 వారాల పాటు గ్రామ సభలు నిర్వహించి కూలీలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో నూతన చట్టంపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను, కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఏటి శేఖర్, ఎస్ఏ కౌముధి, సిప భరత్‌చంధ్, హౌసింగ్ ఏఈ ఇన్‌చార్జ్ దినేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారి ఆలయ శంకుస్థాపన

రామచంద్రాపురం, మార్చి 4 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలోని ఛాయా పురంలో వెలసియున్న శనైశ్చర ఆలయ ప్రాంగణంలో బుధవారం శ్రీమహామం డలేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి ధర్మకర్త ఉంగరాల సుబ్రమణ్యాశర్మ శంకుస్థా పన గావించారు. ఈ శంకుస్థాపన కార్యక్ర మానికి టిడిపి మండల అధ్యక్షుడు తిరుమ లరెడ్డి, గన్నవరం పీఠాధిపతి కమలానంద సరస్వతీ స్వామి, పీఠాపురం ఆస్థానపం డితుడు సుబ్రమణ్యాశర్మ హాజరయ్యారు. ఈ ఆలయ శంకుస్థాపన కార్యక్రమం వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. దక్షిణ భారత దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో ఈ ఆలయం నిర్మించనున్నట్లు ధర్మకర్త తెలిపారు.

## రహదారులు అభివృద్ధికి సూచికలు

రామచంద్రాపురం, మార్చి 4 ప్రభాతవార్త:

రహదారులు అభివృద్దికి సూచికలని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. బుధవారం రామచంద్రా పురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంఎల్ఏ పులివర్తి నాని చొరవతో రూ.10 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధిపనులు చేపట్టడం జరిగిందన్నారు. మండలంలో తిరుచానూరు నుండి చల్లావారిపల్లికి, రామాపురం నుండి శానంబట్లకు, చంద్రగిరి నుండి అనుప్పల్లికి వున్న ఆర్‌అండ్‌బి రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంఎల్ఏ నానికి, ఆర్‌అండ్‌బి ఈఈ రాజా నాయక్‌కు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి!

పాకాల, మార్చి 4 ప్రభాతవార్త:



పాకాల మండలం ముద్దలపల్లి గ్రామ పరిధిలోని పొలాల్లో, రైల్వే ట్రాక్ సమీపంలో సుమారు 40 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని ఓ మగ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా, మృతుడి తలపై బలమైన గాయం ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తు పట్టినట్లయితే వెంటనే పాకాల పోలీసులను సంప్రదించాలని సీఐ మరియు ఎస్ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ 9440796717, 9440796718 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతున్నట్లు సీఐ టి. చిన్న గోవిందు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి పోస్ట్‌కార్డు ఉద్యమం

పాకాల, మార్చి 4 ప్రభాతవార్త:



మండల కేంద్రంలో బుధవారం నిర్వహిం చిన సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉపాధ్యాయుల సమస్యల సాధనకై పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వెంటనే 12వ పీఆర్‌సీ నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏలు అమలుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సంఘం అధ్యక్షులు మనేరి ప్రభు, ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి సుధాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం అవసరమైతే మరింత తీవ్రస్థాయి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు, సీనియర్ సభ్యులు యం.చంద్రశేఖర్, పి. రఘు, హరి, యం. అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్‌కు మూడు లక్షల రూపాయలు విరాళం

తిరుపతి హెల్త్, మార్చి 4 ప్రభాతవార్త:



శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రికి స్విమ్స్ శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి తిరుపతి నగరానికి చెందిన యం. కిషోర్ కుమార్ లలిత్ ఇన్నోవేషన్ ఫుడ్ ప్రై లిమిటెడ్ అధినేత కోరిక మేరకు స్విమ్స్ హాస్పిటల్ పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిగణలోనికి తీసుకొని విరాళం అందించినట్టు తెలిపారు. దాత తరపున తిరుపతి వాస్తవ్యులు వై. రాఘవేంద్ర చేతుల మీదుగా మూడు లక్షల రూపాయలు విరాళాన్ని మూడు చెక్కుల రూపంలో బుధవారం ఉదయం 10 గంటలకు స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్‌కి అందజేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ విరాళ దాత లలిత్ ఇన్నోవేషన్ ఫుడ్ ప్రై. లిమిటెడ్. అధినేత యం. కిషోర్ కుమార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, ఇచ్చిన విరాళాన్ని పేద రోగుల వైద్య సేవలకు ఉపయోగిస్తామని తెలియజేశారు.

# తిరుపతి డివిజన్

## రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

నింద్ర,మార్చి 4 ప్రభాతవార్త :



రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలైన డి మనోజ్, టి.అబినయ్,భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బి.నాధ ముని లను మండల విద్యాశాకాధికారి వసుమతిదేవి బుధవారం ఘనంగా సన్మానించినారు. మండల విద్యాశాధికారి వసుమతిదేవి మాట్లాడుతూ రాష్ట్రస్థా యి సైన్స్ సమగ్ర మహోత్సవం 2క26కు చిత్తూరు జిల్లా నుంచి ఎకైక ప్రాజెక్టుగా ఎంపిక కాబడిన నింద్ర మండలం చవరంబాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి డి.మనోజ్,టి.అబినయ్ ఉపాధ్యా యులు బి.నాధముని ఎంపిక కాబడటం మండలానికి ఎంతో గర్వకారణం అన్నారు.కార్యక్రమంలో విద్యాశాఖాధికారి శ్రీధర్‌రాజు,ప్రధానో పాధ్యాయులు జ్ఞానప్రకాష్,ఉపాధ్యాయులు శేఖర్,సురేష్, పురుషోత్తం,విద్యార్థులు పాల్గొన్నారు.

## 8న జిల్లా స్థాయి శాప్ టెన్నిస్, బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు

**తిరుపతి క్రీడ, మార్చి 4 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ వారి ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, తిరుపతి ఆధ్వర్యంలో ఈ నెల 8న జిల్లా స్థాయి మాస్టర్స్ పురుషుల, మహిళల టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు జిల్లా జట్టులను ఎంపిక చేయనున్నా మని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. శశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో రాణించిన వారు జిల్లా బ్యాడ్మింటన్ ఈ నెల 14, 15 తేదీల్లో డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో, టెన్నిస్‌కు ఎంపికైనవారు. ఈ నెల 22, 23 తేదీల్లో విజయనగరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనవలనని తెలిపారు. ఆసక్తి గల వారు టెన్నిస్కు సంబంధించి శివయ్య (95553691456), బ్యాడ్మింటన్‌కు సంబంధించి రాజు (9849381908) సంప్రదించా లన్నారు.

## జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుక



**సత్యవేడు, మార్చి 4 ప్రభాతవార్త:** పారిశ్రామిక కార్మికుల భద్రతా ఆవశ్యకతను గుర్తిస్తూ బుధవారం శ్రీసిటీలో 55వ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలను జరుపుకున్నారు. ఇందులో శ్రీసిటీ ఉద్యోగులు, పరిశ్రమల సిబ్బందితో పాటు సమీప పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్ భద్రతా జెండాను ఎగురవేసి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలకు భద్రత, ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన కల్పించడమే జాతీయ భద్రతా వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో శ్రీసిటీలో భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచడానికి అందరూ కలసికట్టుగా బాధ్యత వహించాలని పిలుపు నిచ్చారు. శ్రీసిటీ సెక్యూరిటీ, విజిలెన్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వై.రమేష్ రోడ్డు భద్రతా గురించి పలు సూచనలు చేశారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.వారం రోజుల కార్యక్రమాలను శ్రీసిటీ సేఫ్టీ మేనేజర్ కె.నరేంద్రబాబు పర్యవేక్షించారు.

## కార్డెన్ సెర్చ్‌లో సత్యవేడు పోలీసులు

17 ద్విచక్రవాహనాలు, ఆటోలు, కారు సీజ్



**సత్యవేడు, మార్చి 4 ప్రభాతవార్త:** మండలంలోని దాసుకుప్పం గ్రామంలో బుధవారం వేకువ జామున స్థానిక పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సత్యవేడు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు ఆధ్వర్యంలో సత్యవేడు, నాగలాపురం ఎస్ఐలు సాయినాథ్‌చౌదరి, సునీల్ పర్యవేక్షణలో 25 మంది పోలీసు బృందాలు ఏకకాలంలో మూకుమ్మడిగా ఎస్టీ కాలనీ ప్రాంతాన్ని చుట్టు ముట్టాయి. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను ఆరా తీయడంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులో తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో పాటు రికార్డులు సక్రమంగా లేని 17 ద్విచక్రవాహనాలను, రెండు ఆటోలు, ఒక కారు సీజ్ చేశారు.రికార్డులు సక్రమంగా లేకుండా వాహనాలను నడపడం చట్ట విరుద్ధమన్నారు. ప్రతి ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్లను ధరించి వాహనాలను నడపాలన్నారు. ఈ కార్డెన్ తనిఖీల్లో పోలీసులు పాల్గొన్నారు.




## ఆర్టీఐ కమిటీలో ఏకగ్రీవంగా ఎన్నిక

**నాగలాపురం, మార్చి 4 ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షుడు చంటి, ముదిరాజ్ ఆదేశాలతో సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శిగా కె.తమిళ్ మణి,నాగలాపురం మండల ఉపాధ్యక్షుడిగా డి.ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలియజేశారు. సభ్యులు మాట్లాడుతూ మాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్.ఎం.సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రి లో హార్ట్ స్ట్రోక్ ఇంజక్షన్



**చిన్నగొట్టిగల్లు,మార్చి 4 ప్రభాతవార్త:** చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో స్ట్రోక్ చికిత్సకు అవసరమైన టీపీఏ ఇంజక్షన్ అందుబాటులో ఉన్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఎవరికైనా స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి రావాలని ఆయన అన్నారు. స్ట్రోక్ వచ్చిన తొలి గంటల్లోనే టీపీఏ ఇంజక్షన్ వేయడం ద్వారా ప్రాణాపాయం తప్పించవచ్చని చెప్పారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ ఇంజక్షన్ ధర రూ.30 వేలకుపైగా ఉంటుందని, అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో ఇది పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు. అందుబాటులో ఉన్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సాంకేతిక విప్లవానికి పునాది క్వాంటమ్ టెక్నాలజీ



**తిరుపతి విద్య,మార్చి 4 ప్రభాతవార్త:** క్వాంటమ్ టెక్నాలజీ భవిష్యత్తు సాంకేతిక విప్లవానికి పునాది వంటిదని వీసీ టాటా నర్సింగరావు పేర్కొన్నారు. ఎస్వీయూ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్సెంటర్ (ఎంటీటీసీ) సహకారంతో క్వాంటమ్ టెక్నాలజీస్ కాన్సెప్ట్, ఛాలెంజెస్ అండ్ ఆపర్చునుటీస్ అనే అంశంపై ఆరు రోజుల పాటు ఆన్లైన్ విధానంలో జరగనున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ సెన్సింగ్ వంటి రంగాల్లో యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు వర్సిటీలో జరిగే ఈ ప్రోగ్రామ్కు దేశంలోని పలు వర్సిటీల నుంచి అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని, ఇందులో నిపు ణుల ఉపన్యాసాలు ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్డినేటర్ డాక్టర్ హేమలత, ఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ ్మ, ప్రొఫెసర్ హుస్సేన్, ప్రొఫెసర్ వాసుదేవరావు పాల్గొన్నారు.

## వాక్-ఇన్ ఇంటర్వ్యూలు రద్దు చేయండి




**తిరుపతి విద్య,మార్చి 4 ప్రభాతవార్త :** ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా రోస్టర్ విధానంపై స్పష్టత ఇవ్వకుండా వర్సిటీలో హార్టికల్చరిస్ట్, స్టేషనరీ సూపర్వైజర్ పోస్టులకు ఎస్వీయూలో వాక్ఇన్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించడం దారుణమని వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం విద్యార్థి సంఘాల నేతలు వీసీ టాటా నర్సింగరావును కలసి వినతిపత్రం సమర్పిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్వీయూలో నిబంధనలకు విరుద్ధంగా వాక్ ఇన్ విధానంలో నియామకాలు చేపట్టడం కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి లోకేష్,రాష్ట్ర విద్యార్థి హక్కుల సంఘం స్టేట్ సెక్రెటరీ మునుస్వామి, రాయలసీమ స్టూడెంట్స్ అసోసి యేషన్‌జిల్లాఅధ్యక్షులుజ్యోతి ప్రకాష్, విద్యార్థి నాయకులు చైతన్య, పవన్, కిషోర్, సందీప్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి వితరణ

**వరదయ్యపాలెం, మార్చి 4 ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న వరదయ్యపాలెం మండలం గోవర్ధన్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 37 మంది విద్యార్థిని విద్యార్థులకు బుధవారం బిఈపిసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, బీఈపిసి ఫౌండర్ రియాజ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మొహిద్దిన్, ఉపాధ్యాయులు ముద్దు కృష్ణ,

# సిసి రోడ్లు గ్రామంలో వేయండి...పొలాల్లో కాదు



పెళ్లకూరు, మార్చి 4 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామం లోపల గ్రామాలకు వెళ్లి రహదారులు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక నిధులను పంచాయతీలకు విడుదల చేస్తున్నది. పెళ్లకూరు మండలంలో సుమారు 9 కోట్ల నిధులు సిసి రోడ్ల కోసం విడుదల కాగా అందులో ఒక్క చింతపూడి పంచాయతీకే, సుమారు 50 లక్షలు రూపాయలు మంజూరు కాగా, దీనిలో 20 లక్షల రూపాయలు సిసి రోడ్ల పనులు ప్రస్తుతం జరుగుతునన్నాయి. లక్ష్మీనాయుడు కండ్రిగ గ్రామంలో వేస్తున్న ఈసీసీ రోడ్లను ఎంతో కాలంగా రహదారి మార్గం లేకుండా ఇబ్బంది పడుతున్న అంగన్వాడి స్కూల్ భవనానికి కాకుండా, పంట పొలాల్లోకి వెళ్లి రహదారుల్లో సిసి రోడ్లు వేయడం పట్ల



గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలబల్లి చెరువు నుంచి చింతపూడి భీమవరం చెరువులకు ఈ కాలువ ద్వారానే నీటి సరఫరా జరుగుతుంది. ఈ కాలవ సుమారు మూడు మీటర్ల వెడల్పుతో ఉండాలి. అలాంటిది ఈసీసీ రోడ్ల కోసం కుదించి ఆ గట్ల పైన ఈ రోడ్లు వేయడం వల్ల భవిష్యత్తులో కాలువ పూడిక తీత విషయంలో అనేక ఇబ్బందు లు ఎదురవుతాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామస్తులకు అవసరమైన దగ్గర ఈ సీసీ రోడ్లను వేయించినట్లయితే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

## పెరియవట్టు హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

**- పాతకక్షలతోనే ప్రభాకరన్ హత్య!**



సూళ్లూరుపేట, మార్చి 4 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ప్రాంతంలో సంచలనం కలిగించిన తడ మండలం పెరియవట్టు గ్రామానికి చెందిన ప్రభాకరన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు సూళ్లూరుపేట సీఐ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 28న పెరియవట్టు గ్రామానికి చెందిన ప్రభాకరన్ తన పంచరు షాపులో పనిచేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు వి.దినేష్, సతీష్, విఘ్నేష్‌లు మూకుమ్మడిగా ప్రభాకరన్‌పై కత్తులతో దాడి చేసి హత్య చేశారు. గతంలో ఒక దాబా వద్ద ప్రభాకరన్‌కు, నిందితులకు ఉన్న పాత గొడవల కారణంగా ఈ హత్యకు పాల్పడ్డారు. హత్య జరిగిన నాలుగు రోజుల్లోనే జిల్లాఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాలు, డిఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో సిఐలు మురళీకృష్ణ, సంగమేశ్వరరావు, ఎస్సై కొండప్పనాయుడులు పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను చాకచక్యంగా వలపన్ని బుధవారం ఉదయం రాఘవ కాంప్లెక్స్ వద్ద పట్టుకుని అరెస్టు చేశారు. అనంతరం వీరిని కోర్టుకు హాజరు పరిచారు.

## షార్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం



సూళ్లూరుపేట, మార్చి 4 ప్రభాతవార్త: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం శ్రీహరికోటలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సివి రామన్ చిత్రపటానికి షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్, ప్రత్యేక అతిథి టివి వెంకటేశ్వరన్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ టివి వెంకటేశ్వరన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఉపయోగపడతాయన్నారు. అనంతరం షార్ స్పేస్ సెంట్రల్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలను పరిశీలించారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెలియన్, కంట్రోలర్ జి.రమేష్‌బాబు, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ లైన్‌మెన్ దినోత్సవం

సూళ్లూరుపేట, మార్చి 4 ప్రభాతవార్త: జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎడిఇ శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి లైన్‌మెన్ సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎడిఇ శేఖర్ సూచించారు. వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న విద్యుత్ కార్మికుల సేవలకు గుర్తుగా జాతీయ లైన్‌మెన్ దివస్‌ను ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి



సూళ్లూరుపేట, మార్చి 4 ప్రభాతవార్త: పట్టణంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని నియంత్రించేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం రోడ్ల పక్కన పార్కింగ్ లేని చోట్ల నిలిపి ఉన్న వాహనాలకు లాక్‌లు వేసే ప్రక్రియను చేపట్టారు. అలాగే సూళ్లూరుపేట పట్టణంలోని ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు ఇందుకు సహకరించాలని ఎస్ఐ అజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

## ఇంటి స్థలాల కోసం దాడులు!

**- రెవెన్యూ అండ దండలతో భూ ఆక్రమణలు - ఆక్రమణలతో కుమ్ములాట - పోలీస్ స్టేషన్ చేరిన వివాదం**



దొరవారిసత్రం, మార్చి 4 ప్రభాతవార్త: శ్రీహరికోట పునరావాసులు ఇచ్చిన ఇంటి స్థలాలు వివాదాలు తారా స్థాయికి చేరి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దొరవారిసత్రం పరిధిలోని కృష్ణాపురం గ్రామ పరిధిలోని 305 సర్వేనెంబర్లు 1973లో శ్రీహరికోట పునరావసులకు అప్పట్లో ఇంటి పట్టాలు అందజేశారు. అయితే ఇంటి పట్టాల్లో బాధ్యతలు కాకుండా నకిలీ పత్రాలు సృష్టించి మరి కొందరు 305 సర్వే నంబర్ ఇంటి స్థలాలు ఆక్రమించు కుంటున్నారని, అయితే ఈ ఆక్రమణదారులు రెవిన్యూ అధికారులకు మామూలు ఇచ్చి ఇస్తారాజ్యంగా ఆక్రమణ చేస్తున్నారని ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు అర్హులైన బాధ్యతలే కాకుండా మరికొందరు మేము కూడా శ్రీహరికోట పునరావసరమే అంటూ పుట్టగొడుగులు లాగా పుట్టుకొస్తున్నారు. అయితే నాలుగు రోజుల క్రితం శ్రీహరికోట పునరావాసులు ఒకరిని ఒకరుకొట్టుకొని రక్త గాయాలుతో పోలీస్ స్టేషనకు చేరినా వివాదం ఇప్పటికైనా సంబంధిత అధికారులు అసలైన బాధ్యతలను గుర్తించి న్యాయం చేసి అక్రమదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

## చెరువు నీటిని అడ్డుకోవడం దారుణం



పెళ్లకూరు, మార్చి 4 ప్రభాతవార్త: మండలంలోని చిల్లకూరు పంచాయతీలో గత కొంతకాలంగా మన్నే ముత్తురు చెరువు నీటి విషయంలో అధికార ప్రతిపక్ష నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ గత కొద్ది రోజులు ముందర చెరువు నీటిని వ్యవసాయ అవసరాలకు కాకుండా బాతులు మేపులు కోసమని వృధా చేస్తున్నారన్నారు. చెరువు తూములను మూయించి వేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో చిల్లకూరు వైఎస్ఆర్పిపి నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి బుధవారం నాడు మన్నే ముత్తురు చెరువు దగ్గర మట్టితో పూడ్చి వేసిన తూములలోని మట్టిని తొలగించి పంట పొలాలకు నీటిని వదలాలని నిరసన వ్యక్తం చేశాడు. ఈ విషయంలో రైతులు రెండవసారి పంట పొలాల సాగుకు నీరు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని వారికి న్యాయం చేయడం కోసం రైతులు పక్షాన నిలబడి హైకోర్టును ఆశ్రయించైన పోరాడుతామని అన్నారు.

## 7న పరశురామేశ్వరాలయం బాలాలయ స్థాపన

**-ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం**



ఏర్పేడు, మార్చి 4 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడి మల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశు రామేశ్వరా లయం కుంబా భిషేకం వచ్చేనెల 19 నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయ ఆవరణలో ధర్మకర్తల మండలి సమావేశం ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరినాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కుంబాభిషేకానికి సంబంధించి ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి, ఆలయ ప్రధానార్చకులు ఎన్.వంశీ కృష్ణ శర్మలు బోర్డు సమావేశంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు మాట్లాడుతూ అతి పురాతనమైనదని దీని నిర్వహణను పురావస్తుశాఖ పర్యవేక్షిస్తుందని సభకు వివరించారు. ప్రస్తుతం ఇక్కడ కుంబాభిషేకానికి సంబంధించి కేంద్ర పురావస్తుశాఖ నిర్వహిస్తుందని తెలిపారు. అయితే వచ్చేనెల జరిగే మహాకుంబాభిషేకానికి సంబంధించి బాలాలయ ప్రతిష్ట జరగాల్సి ఉందని వివరించారు. ఈ దేవాలయానికి సంబంధించి ఎలాంటి అభివృద్ధి పనులు, మరమ్మతులు, మార్పులు చేర్పులు చేయాలన్నా, చేపట్టాలన్నా కేంద్ర పురావస్తుశాఖ వారికి ప్రతిపాదిస్తే వారు చేపడతారని వివరించారు. ఇక స్వామి వారి కైంకర్యం, పూజల నిర్వహణ పర్యవేక్షణ రాష్ట్ర దేవాదాయశాఖ పర్యవేక్షిస్తున్నట్లు సభ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం రాజగోపురం పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు మూలవిరాట్టుకు బాలాలయం చేయాల్సి ఉన్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వంశీ కృష్ణ ఇచ్చిన నివేదికను సభలో చర్చకు పొందుపరచారు. బాలాలయం అంటే స్వామి విగ్రహా రూపాన్ని అ త్తికొయ్యతో తయారు చేసి అందులో మూలవిరాట్టును ఆవాహన చేయాల్సి ఉంటుందని వివరించారు. ఆగమశాస్త్రం ప్రకారం బాలాలయంలో స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించాల్సి ఉంటుందని సభ దృష్టికి తెచ్చారు. ఇందుకు ప్రధానార్చకులుఅ ందించిన నివేదికను సభలో చర్చించారు.

**7 నుంచి బాలలయం:పూజలు**

గుడిమల్లం అలయ కుంబాభిషేకానికి సంబంధించి ఈ నెల 7న చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ఆనందవల్లి సమేత పరశురామేశ్వరామేశ్వర వారి అనుజ్ఞ వినాయ పూజా శుద్ధి పుణ్యాహావాచనం గోపూజ, మహాసంకల్పం, గణపతి మహాలక్ష్మీ, నవగ్రహ దేవతల కలశ స్థాపన వేదాపారాయణ, హోమాలు పూర్ణాహుతి దీపారాదన అలాగే సాయంత్రం కార్యక్రమాలను నిర్వహించుటకు ప్రణాళిక రూపకల్పన చేసినట్లు సభకు తెలిపారు. కాగా 8వ తేది ఆదివారం ఉదయం 6గంటల నుంచి ఆగమ శాస్త్రం ప్రకారం విశేష హోమాలుపూజలు నిర్వహిస్తారని 9గంటలకు మహాపూర్ణాహుతి, 9.15గంటలకు కలశోద్వాసన 10గంటలకు మహాదీపారాధన నిర్వహించుటకు తీర్మానించినట్లు సభ దృష్టికి తెచ్చారు. చుట్టపక్కల గ్రామాలకు చెందిన భక్తులే కాకుండా విఐపిలు హాజరౌతారని చైర్మెన్ బత్తల గిరి నాయుడు సభకు వివరించారు.

## యువత అపార అవకాశాలను వినియోగించుకోవాలి

**-ఎస్పీడిసిఎల్ జాబ్‌మేళాలో 522 మందికి ఉద్యోగ నియామక పత్రాలు**




తిరుపతి, మార్చి 4ప్రభాతవార్త: నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా అపార అవకాశాలను వినియోగించుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ నిర్దేశం చేశారు. తిరుపతి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, రాష్ట్రంలోనే అత్యధిక పరిశ్రమలు కలిగిన జిల్లాలలో ఒకటిగా ఎదుగుతోందని తెలిపారు. ప్రత్యేకంగా శ్రీ సిటీ లోని ఎలక్ట్రానిక్ మ్యాను ఫ్యాక్చరింగ్ క్లస్టర్, నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్క్ వంటి పారిశ్రామిక కేంద్రాల ద్వారా జిల్లాకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఎస్పీడిసిఎల్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ విభాగం సహకారంతో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీడిసిఎల్ సిఎండీ లోతేటి శివశంకర్ సంస్థ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. జిల్లాలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, మాన్యు ఫ్యాక్చరింగ్ రంగాలలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, యువత ఈ అవకాశాలను వినియోగించుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. యువత అవకాశాలను అందిపుచ్చుకుని, జీవితంలో ముందుకు సాగాలని ఎస్పీడిసిఎల్ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. ఈ జాబ్ మేళాకు 1,577 మంది అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. 522 మందికి నియామక పత్రాలు ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి అందజేశారు. అయూబ్ ఖాన్, కె. గురవయ్య, కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు సిహెచ్ రామచంద్ర రావు, కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, యం. మురళీ కుమార్, యం. ఉమాపతి, యం. కృష్ణారెడ్డి, కె. సంపత్ కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, జనరల్ మేనేజర్లు సి. ప్రసాద్, వై. వెంకటరాజు, ఎస్. శ్రీనివాసులు, జి. చక్రపాణి, పి. రవికుమార్, పిఆర్ఓ తోట మధుసూదన, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం, నియామక అధికారి ఎ. గణేష్, పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన వైద్యసేలందించాలి

**-టిటిడి జెఈఓ డాక్టర్ శరత్**



తిరుమల, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల ఆలయంతోబాటు పరిసరాల ఆలయాల్లో దర్శనార్థం విచ్చేసే భక్తులు అనుకోకుండా అనారోగ్యానికి గురైన సందర్భాల్లో వారికి మరింత విశ్వాసాన్ని కల్పించే విధంగా సమగ్ర వైద్య సేవలు అందించాలని టిటిడి జెఈఓ డాక్టర్ ఎ. శరత్ సూచించారు. తిరుచానూరు లోని టిటిడి ఉచిత వైద్యశాలను, అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. తిరుచానూరులోని టిటిడి ఉచిత వైద్యశాలలో భక్తుల సౌకర్యార్థం ఐదు నుండి 10 పడకలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో చిన్నపాటి వైద్య సహాయం కూడా రోగులకు అపారమైన ధైర్యాన్ని నింపుతుందని పేర్కొన్నారు. తిరుచానూరులో రోజుకు సుమారు 100 నుండి 150 మంది ఔట్‌పేషెంట్లు వైద్య సేవలు పొందుతు న్నారని, మరింత మందికి నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించేలా తగిన ఏర్పాట్లు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన మందులను సమృద్ధిగా నిల్వ ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఎంవో డాక్టర్ కుసుమ కుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుహర్లత, వైద్యుడు డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు

**- జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ**



వెంకటగిరి, మార్చి 4 ప్రభాతవార్త: ఉన్నత చదువు తూనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ తెలిపారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులు చదువుపై దృష్టి చారించాలని సూచించారు. మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో యువతరం ఫౌండేషన్ చైర్మన్ చంద్రగిరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్ష సామాగ్రిని న్యాయమూర్తి విష్ణు వర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రాజ్యాంగం సృష్టించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సైతం పేదరిక కుటుంబంలో జన్మించిన వ్యక్తేనని చదువులో రాణించి దేశం గర్వించదగ్గ వ్యక్తిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎదిగారని కొనియాడారు. అటువంటి వారు దేశంలో ఎందరో ఉన్నారని వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎస్సై స్వరూప, న్యాయవాది గాంధీ, ప్రిన్సిపల్ డాక్టర్ షాహినా భాను, అధ్యాపకులు కుంచాల దుర్గారావు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం దిశగా...రెవెన్యూ క్లినిక్




తిరుపతి, మార్చి 4ప్రభాతవార్త: భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్ ప్రవేశపెట్టిందని, తాశిల్దార్లందరూ భూ సమస్యల పరిష్కార దిశగా దృష్టి పెట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డిఆర్ఓ నరసింహులుతో కలిసి పీజీ ఆర్ఎస్, రీ సర్వే, మ్యుటేషన్, పట్టాదారు పాస్ పుస్తకాలు, కోర్టు కేసులు వంటి అంశాలపై జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు రెవెన్యూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్ ప్రవేశపెట్టిందని పరిష్కార దిశగా తాసిల్దార్లందరూ కృషి చేయాలని తెలిపారు. నిషేధిత భూముల జాబితాకు భూములకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పూర్తిచేయాలని అన్నారు. అందుకు సంబంధించిన ప్రక్రియ ప్రతిపాదనలు నెల లోపు పూర్తి చేయాలని తెలిపారు. కోర్టు కేసులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి, పెండింగ్ కేసులు లేకుండా చూడాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా వ్యవహరించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోస్మాండ్, తిరుపతి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామ్మోహన్, దేవేంద్రరెడ్డి, అన్ని మండలాల తాసిల్దారులు, సంబంధిత రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలు లేకుండానే...గ్రామ సభ!

వరదయ్యపాలెం మార్చి 4, ప్రభాతవార్త: గ్రామ ప్రజలు హాజరు లేకుండానే గ్రామ సభ నిర్వహించడంపై గ్రామంలో చర్చనీయాంశమైంది. ప్రజల భాగస్వామ్యం లేకుండా సమావేశం జరపడం ఎలా సాధ్యమైందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. గ్రామ సభ అనేది ప్రజల అభిప్రాయాలు, సమస్యలు, సూచనలు తెలుసుకునే వేదిక. అయితే ఇటీవల నిర్వహించిన గ్రామ సభలో సాధారణ ప్రజలు లేకుండానే కార్యక్రమం పూర్తి చేయడం గ్రామస్థులను విస్తుపోయేలా చేసింది. ఈ సందర్భంలో పంచాయతీ సెక్రటరీ చేసిన వ్యాఖ్యలు మరింత చర్చకు దారి తీశాయి. "గ్రామ సభ నిర్వహించాం అని అధికారికంగా ప్రకటించడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలు లేకుండా గ్రామ సభ జరపడం మీకే సాధ్యం. ఎంత టాలెంటెడ్‌గా ఉన్నారో అంటూ వ్యంగ్యంగా స్పందించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## చెరువు ఆక్రమణలను అడ్డుకోవాలి



నాయుడుపేట, మార్చి 4 ప్రభాతవార్త: నాయుడుపేటలోని పూదురు చెరువు బఫర్ జోన్ ఆక్రమణలను వెంటనే తొలిగించాలని పుదూరు గ్రామానికి చెందిన 75 మందికి పైగా సన్నకారు రైతులు బుధవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పుదూరు చెరువు సమీపంలోని బఫర్ జోన్‌లో కొంతమంది అక్రమంగా భూమిని ఆక్రమించి హద్దురాళ్ల నాటి పెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు సిద్ధపడ్డారన్నారు. ఈ విషయమై అడిగేందుకు వెళ్లిన మాకాని రత్నమ్మతో పాటు మరికొంతమంది మహిళలపై అక్కడ స్థలాన్ని ఆక్రమణ చేస్తున్న వారు దౌర్జన్యం చేశారని ఆర్ఐ సాయితో పాటు సర్వేయర్ చరణ్, వీఆర్ఓ మనోజ్‌లకు వినతిపత్రం అందించారు. హద్దురాళ్ల వేస్తున్నప్పుడు అడ్డుకునేందుకు వెళ్లగా మాకు తహశీల్దార్ పట్టాలు ఇచ్చారని మాపై దౌర్జన్యానికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు బఫర్ జోన్ భూమిలో ఏ విధంగా పట్టాలు ఇస్తారంటూ గ్రామస్తులు బుధవారం రెవెన్యూ అధికారులను నిలదీశారు. అక్కడి సన్నకారు రైతులు పంటలు పండించుకుని ధాన్యాన్ని తీసుకువెళ్లేందుకు దారి లేకుండా చెరువు భూమిని ఆక్రమణలు చేస్తున్నారని వారు ఆవేదన చెందారు. ఈ విషయమై అధికారులు వెంటనే స్పందించి వేసిన హద్దురాళ్ల తొలిగించి న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పూదురు గ్రామస్తులు హెచ్చరించారు.

## కేవీని పరామర్శించిన సంచి కృష్ణయ్య



పెళ్లకూరు, మార్చి 4 ప్రభాతవార్త: మండలం చిల్లకూరు పిఎసిఎస్ చైర్మన్ కె.వి నాయుడును పెళ్లకూరు మండలం తే దే పా అధ్యక్షులు సంచి కృష్ణయ్య యాదవ్ బుధవారం నాడు రావులపాడులోని కె.వి నాయుడు నివాసంలో ఆయనను కలిసి పరామర్శించారు. కె.వినాయుడును పరామర్శించిన వారిలో తెదేపా నాయకులు కోటా రమేష్ యాదవ్, రాపూరు పరశురాం, మేక పిల్ల రవి, మెరుం చంద్ర ఉన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని హుండీ రాబడి రూ.2.50కోట్లు



శ్రీకాళహస్తి, మార్చి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని హుండీ రాబడి ఏ నెలకా నెల పెరుగుతుంది. బుధవారం ఆలయంలోని మందుకొట్టు మండపంలో 32 రోజుల పాటు భక్తులు స్వామి అమ్మవార్లు, పరివార దేవతల హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి, తిరుపతి జిల్లా దేవాదాయ ఇన్స్పెక్టర్ ఫణీంద్ర ,డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టిల పర్యవేక్షణలో సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. హుండీల్లో నగదు రూ.2,40,57,722 చిల్లర నాణెములు 9,64,524 వచ్చినట్లు ఆలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపారు. కాగా బంగారు 68 గ్రాములు, వెండి నాగపడగల రూపంలో వెండి 624కిలోల 100 గ్రాములు వచ్చింది. విదేశీ కరెన్సీ 147 నోట్లు వచ్చింది.

## ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్‌లో ఫుడ్‌ఫెస్ట్



శ్రీకాళహస్తి, మార్చి 4 ప్రభాతవార్త: పట్టణంలోని ఆక్స్‌ఫర్ట్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం ఎక్స్పో ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, చిన్నారులకు సమాజిక అవగాహనకు ప్రతి నిత్యం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులు, కళాత్మక ప్రదర్శనలు సృజనాత్మక ఆవిష్కరణల ద్వారా తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. పిల్లలు తయారు చేసిన విన్నూత్న ప్రాజెక్టులు, శాస్త్రీయ నమూనాలు, సామాజిక అంశాలపై రూపొందించిన ప్రదర్శనలు సుమారు 150కి పైగా ఆకట్టుకున్నాయి. ఇక ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని రుచికరమైన వంటకాలను ఆస్వాదించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయటానికి వారిలోని అభిరుచులను తెలుసుకొనుటకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థుల కృషి, శ్రద్దను ప్రసంశించారు.

## రేషన్ బియ్యం పట్టివేత



తొట్టంబేడు మార్చి 4 ప్రభాతవార్త: ప్రభుత్వం నిబంధనలను ఎంత కఠినంతరం చేసిన కొత్త తరహాలో రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గంలో దోపిడీ చేస్తున్నారు. తొట్టంబేడు ఎస్సై బి.బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకుపెళ్ళకూరు మండలం పిటికండ్రిక గ్రామానికి చెందిన ఏ.వంశీకృష్ణ అను వ్యక్తి లింగమ నాయుడుపల్లి పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని చుట్టుపక్కల ప్రజల నుంచి సేకరించి ఎటువంటి రసీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న సమయంలో తమ సిబ్బందితో దాడి చేసే పట్టుకున్నా మన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వంశి కృష్ణ ని పట్టుకుని అతని వద్ద నుండి ఒక అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని 2500 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసామన్నారు. ఈ మేరకు తొట్టంబేడు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ తెలగనేని సుజాత, వీఆర్వో టి.పాండులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## లోకేష్ ఆత్మీయ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



వెంకటగిరి, మార్చ్ 4, ప్రభాతవార్త: రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన ఆత్మీయ విందులో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఉమ్మడి నెల్లూరు తిరుపతి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలకు నారా లోకేష్ విజయవాడలో ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణను లోకేష్ ఆత్మీయంగా పలకరించారు. లోకేష్ కు వినాయకుడు ప్రతిమను ఎమ్మెల్యే అందజేశారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను లోకేష్ ఎమ్మెల్యేని అడిగి తెలుసుకున్నారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు.

## ఆరోగ్యం పట్ల మహిళలు శ్రద్ధ చూపాలి : సిఐ



వెంకటగిరి, మార్చి 4 ప్రభాతవార్త : మహిళలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్త వ్యవహరించాలని సిఐ ఏవి రమణ తెలిపారు. ఈ నెల 8వ తేదీ మహిళ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమ ంలో భాగంగా వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు అనారోగ్యం పాలైతే కుటుంబం మొత్తం ఇబ్బంది పడుతుందని తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించుకుని ప్రాథమిక దశలోనే వ్యాధులను నయం చేసుకోవాలని సూచించారు. 14 సంవత్సరాల వయసున్న పిల్లలకు క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. మహిళలందరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సిడిపిఓ శంషాద్ బేగం మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముందుగా వైద్య పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. వైద్య పరీక్షలు చేసుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రతిభా చౌదరి, రాఘవేంద్ర, సాయి సతీష్, ఎస్సై ఏడుకొండలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి



బాలాయపల్లి, మార్చి 4 ప్రభాతవార్త : మండలం పెరిమిడి గ్రామంలో వెలసియున్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో 84వ ఆనంద అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం సందర్భంగా నెల్లూరు నారాయణ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ప్రముఖ వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నెల్లూరు నారాయణ స్పెషాలిటీ హాస్పిటల్ స్పెషలిస్ట్ ప్రముఖ వైద్యులు శరన్ కుమార్, యామిని, బిపి, షుగర్, కీళ్లు, ఎముకలు ఇంకా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు మందులు అందజేశారు. శ్రీకాళహస్తి, తమిళనాడు, వెంకటగిరి, ఇంకపలు ప్రాంతాల ప్రజలు ఈ మెడికల్ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ మెడికల్ క్యాంపులో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.